సోమ : అలా అనీకండి. నా కెంతమంది పిల్లలో తెలిస్తే అలా అనరు మీరు. నా కైదుగురు మొగపిల్లలూ, అయిదుగు రాడపిల్లలూను. ఒంటిగాణ్ని, ఏదో సంసారాన్నిలా ఈదుకొస్తున్నాను. చూస్తే దమ్మిడీ ఎత్తు వెనకదన్ను లేదు. అంచేత, మరింక ఆస్తీ పాస్తీ ఏం వున్నా పిల్లలే ఆస్తి.

రమ : పిల్లలే ఆస్తి! అది పెట్టి ఆడపిల్లకి పెళ్ళి చేసుకోండిప్పుడు.

సోమ : ఆగ్రహించకు బాబూ! పిల్లలే ఆస్తంటే వాళ్ళే రూపాయిలూ, అణాలూ, పైసలూ అనా? అదికాదే!

రమ : అదికాదు ఇదికాదు. ఏంవిటి కాదయ్యా? పదిమంది పిల్లల్ని ఎత్తుకుని నా పీకలమీద సవారీ అయిపోదాంవంటే లాభం లేదు. తెలిసిందా? నో యూజ్. ఎవడు కనమన్నా డంతమందిని?

సోమ : ఒకాడు కనమనే దేవిటి? మిమ్మల్ని మిమ్మల్నీ అడిగి పిల్లల్ని కంటాంటండీ? ఇదెక్కడైనా ఉందా?

రమ : మీరింకా కొట్టే మాటాడక ఇక్కణ్నించి దయ చెయ్యండి (అంటూ తలమీద టోపీ పెట్టుకున్నాడు).

చంద్ర : సోవంనాథంగారూ, ఆయన పనిమీద వెళ్తాం వంటున్నారు. తరవాత నింపాదిగా మాట్లాడుకోవచ్చు. ఇప్పుడు మరి, లెండి.

సోమ : ఈపాటి దానికి మళ్ళీ మగోప్పడెందుకురా?! బాబూ, రవణయ్ బాబూ! తప్పులుంటే క్షమించు. మనవాళ్ళల్లోకల్లా నువ్వే శ్రీమంతుడి వయేవు. కలిగినవాడివి. కలకాలం వర్ధిల్లు. దానికితోడు ఆపదలో ఉన్నవాడి కడ్డుపడితివా—ఆదేవుడి పేరు పెట్టుకున్నందుకు—ఏడుకొండల వెంకట్రవణ మూర్తి లాంటి వాడివేనని నీకందరూ జోహార్లు చెయ్యక మానరు, విన్నావా?

రమ : ఏవింటి వినడం? ఇక్కడధిక ప్రసంగం చెయ్యకు (శేఖరంతో) ఎవరయ్యా ఇతనూ, పొద్దుటే తగులుకున్నాడూ?

సోమ : (రమణయ్యకి దగ్గరగా వెళ్ళి టోపీమీద చేతులు వెయ్యబోయేడు. అతను తలవెనక్కి తీసుకున్నాడు.)

రమ : వాటిజ్ దిస్? ఏవింటి చేస్తున్నావ్?

సోమ : రవణయ్య బాబూ! నెత్తిని కిరీటం పెట్టుకున్నావు. నాకు తండ్రిలాటి వాడివి. ఈ కష్టంలో సాయపడితివా నా మనవడికి నీ పేరు పెట్టిస్తాను. విన్నావా? అల్లుళ్ళవి తప్పించి నేనెవడి కాళ్ళూ పట్టుకోలేదు, చూడ్రా బాబూ చేతులుపట్టుకు అడుగుతున్నాను. పిల్లలవాణ్ణి, ఈ కాస్త సాయప్పుం చేసి కాపాణ్ణన్ను.

రమ : (గట్టిగా కేక లేస్తూ లేచి) పిల్లలూ! పిల్లల వాళ్ళూ! పూటకి టికాణా లేనివాడికి పదిమంది పిల్లలా?! బుద్ధీ జ్ఞానం ఉండొద్దూ? పైసా లేనివాడివి పదిమందిని కంటావా?

సోమ : ఎందుకురా ఆ కేకలూ? (అని ఆశ్చర్యం పడ్డాడు.)

రమ : పదిమందిని కని వారేసి వాళ్ళకి చేసిందేవింట్నువ్వు? తిండి పెట్టవు. బట్టలివ్వవు, చదువు చెప్పించవు, పెంచలేవు, పోషించలేవు, పిల్లలవాట్ట! పిల్లలవాడు! సిగ్గులేదూ చెప్పుకుందికీ?

సోమ : దానికి సిగ్గెందుకూ? దానికీ సిగ్గే?!

రమ : (కూర్చొంటూ) సిగ్గూ లజ్జా లేని పశువులు, చదువుండదు. సంస్కారం వుండదు. పిల్లల్ని కని పారెడం, వాళ్ళు గాలికి బతకడం, తిండికి నిన్నూ నన్నూ ముష్టెత్తడం. లేకపోతే నీ ఇల్లూ నా యిల్లూ కన్నంవెయ్యడం (అని సోఫాలోంచి మళ్ళీ లేచి) దొంగలు, దొంగలవుతారు మీ పిల్లలు, తెలిసిందా? దొంగలవుతారు (అని అరిచి ఆయాసపడుతూ కూర్చున్నాడు,)

సోమ : ఏంవిట్రా శేఖరం? ఇతగాడికి మతికాని పోయిందేవింట్రా? వాళ్తేరు మనిషిలా మాట్లాడుతున్నా డేవింటి?

[కోపంవల్ల తనని తాను మర్చిపోయినట్టుగా కూర్చున్నాడు రమణయ్య]

